# ప్రక్షాళన

క్లాస్‌రూమ్‌లో అడుగు పెడుతూనే నిర్మలని అభినందించింది తెలుగు లెక్చరర్ సౌభాగ్యం.

"కంగ్రాట్యులేషన్స్ నిర్మలా, నిన్న పత్రికలో నీ కథ చూసానమ్మా చాలా బావుంది."

నిర్మల వంచిన తల ఎత్తలేదు "మొదటి కథే ఇంత చక్కగా రాశావంటే, రచయిత్రిగా నీకు ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉంది. ఇలాగే నీరచనా వ్యాసంగాన్ని కొనసాగించు. చక్కని శైలి, కథా వస్తువు, కథాకథనం ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి."

నిర్మల మౌనం వహించటంతో ఆమె భుజం తట్టింది. స్నేహితురాళ్ళంతా "చూడండి మేడం! దీని వాలకం ఇందాకట్నించి ఇలానే బొమ్మలా మెదలకుండా ఉంది. బాగా రాసావే అంటే మాట్లాడదు.

"అవును మేడం! దీని ఎత్తు మాకు తెలుసు, మనకి పార్టీ ఇవ్వాలని తప్పించుకోవాలని చూస్తోంది."

నిర్మల అతి ప్రయత్నం మీద పెదవులపై చిరునవ్వు పులుముకుంది.

"అదేం కాదు! నాకేమిటో నోట మాటరావటం లేదు. మేడం నన్ను క్షమించాలి.

సౌభాగ్యం వైపు తిరిగి చేతులు జోడించింది

ఆమె వైఖరి అర్థంకాక ఆశ్చర్య పోయిందావిడ పాఠం చెప్పటం ప్రారంభించినా నిర్మల ముఖంలోకి పరిశీలగా చూడ సాగింది. సాహిత్యం అంటూ ఏవో అసందర్భపు రాతలు రాస్తున్న ఈ రోజుల్లో ఈ పిల్ల తన మొదటి కథే ఇంత చక్కగా రాయ గలిగిందని నిన్నటినుంచి తను తెగ సంబరపడి పోయింది. కాని ఈ అమ్మాయి తత్వం ఏమీ బోధపడటం లేదు. ఏమిటీ మౌనం, నిర్లిప్తత?

నిర్మలకి పాఠం తలకెక్కడం లేదు. తనని మనఃపూర్వకంగా మెచ్చుకొని అభినందనలు చెప్పిన మేడం ఎదురుగా కూర్చువటమే కష్టంగా ఉంది. తలనెప్పి ఎక్కువగా ఉందని పర్మిషన్ తీసుకుని నెమ్మదిగా లేచి వచ్చేసింది. తన ఇంటివైపు నడక సాగిస్తూ ఆలోచనలో పడింది. స్నేహితురాళ్లు తను కథ రాసినందుకు తెగ పొంగిపోతున్నారు. తను ఇలా ఉంటే వాళ్ళ అభినందనలు అల్లరిగా మారుతున్నాయి. తనేదో రాస్తున్నట్లు వాళ్ళతో ఆనందాన్ని పంచు కోనట్టు తెగ బాధపడిపోతున్నారు. మేడంఅయితే తనకి రచయిత్రిగా మంచి భవిష్యత్తు ఉందన్నారు. తన కథ ఆమెలో ఆ భావం

కలిగించింది. ఇంట్లో అడుగు పెడుతునే వంటింట్లోకి పరుగుతీసి అమ్మ ఇచ్చినవేడివేడి కాఫీతో ఆలోచనలకి ఫుల్ స్టాప్ పెట్టింది. ఐదు నిమిషాలు గడిచాయో లేదో అన్నయ్య ఆఫీసు నుంచి వచ్చాడు. అతని ముఖం వెలిగిపోతోంది. చేతుల్లో స్వీట్స్ పాకెట్ నిర్మలకి ఏదో భయంకరమైన వస్తువుగా కన్పించింది. అన్నయ్య తను రచయిత్రి అని సంబర పడిపోయి, దీనిని తెచ్చేసి ఉంటాడు. ఈ స్వీట్స్ అందించి తనని తెగ ప్రశంసిస్తాడు.

"సుశీలా ఇవాళ నాకు చాలా ఆనందంగా ఉందోయ్?"

"మీరు ప్రత్యేకం చెప్పనక్కర్లేదు లెండి! మీ సంతోషం అంతా ముఖంలోనే ప్రతిఫలిస్తోంది. మరి మీ చెల్లెలు రోజస్తమానం ఏవో పత్రికలు తిరగేస్తుంటుందని, చదువు కన్నా ఎక్కువ శ్రద్ధ ఆ పత్రికలమీదే తనకుందని తెగ అనే వారుగా, ఇప్పుడు చూడండి మా ఆడపడచు రచయిత్రి అయిపోయింది. గొప్పగా మీరు స్వీట్స్ పాకెట్ తెచ్చారు కానీ నేను పొద్దున్నే బొబ్బట్లు చేసాను. అప్పుడు కాలేజికి టైమైపొయిందని హడావిడిగా వెళ్ళిపొయింది, ఇప్పుడు చూడండి! తలనెప్పంటూ ఎలా కూర్చుందో, పిచ్చిపిల్లకి తలనెప్పి ఇప్పుడే రావాలా?"

"అవన్నీ ఇట్టే ఎగిరిపొతాయిలే" టేబిల్ పై తల ఆన్చి కూర్చున్న నిర్మలను ప్రేమగా పిలిచాడు మూర్తి.

కరచాలనం చేస్తూ "చెల్లాయ్ కంగ్రాట్యులేషన్ అమ్మా ఏవిటో అనుకున్నాను. నువ్వు చక్కటి కథరాశావు. నోరు తెరు, నాచేత్తో స్వీట్స్ తినిపించనీ" నిర్మల నోటికి స్వీట్ అందించాడు.

"ఏమిటమ్మా పత్రికలో నీ కథ వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను.

తొలికథ అచ్చయితే తొలిసారి నెల తప్పిన కొత్త పెళ్ళి కూతురిలా సిగ్గుపడిపోతున్నావు" సుశీల పరిహాసం చేసింది.

మరోసారి నిర్మల అతిప్రయత్నం మీద ముఖానికి నవ్వు పులుముకుంది "ఏంలేదు వదినా! ఏవిటో ఒంట్లో కూడా నలతగా ఉంటేనూ! మీరంతా ఇలా మురిసిపోతుంటే నాకు మాత్రం ఆనందంగా లేదా ఏమిటీ" అనేసింది.

ఓ వారంరోజులకే అచ్చయిన తన కథ గురించి ప్రశంసా పూర్వకమైన లేఖలు వెలువడ్డాయి. ఆ పత్రికలో తనకు దూరాన ఉన్న నెచ్చెలులు, పరిచితులు, అపరిచితులు అయిన పాఠకులెంద రెందరో తను రాసిన కథ వారికెంతో నచ్చినట్లు లేఖా పరంపర కురి పించారు. వ్యాకులపడ్డ నిర్మల ఓ నిశ్చయానికి వచ్చింది. ఆ అభినందనలు, ప్రశంసలు అన్నీ తను మనఃపూర్వకంగా స్వీక రించగలగాలి అంటే తనో మంచి రచయిత్రి అయితీరాలి. తన ఉనికి ఈ సమాజానికి ఎంతో ఉపయుక్తం కావాలి. మేడం అన్నట్లు నెచ్చెలులు ముచ్చట లాడినట్లు తను ఎంతెంతో కీర్తి గడించాలి. ఆమెలో ఆశయం బలపడిపోయింది. తపన బయలుదేరింది. వృధా కాలయాపనకి పూర్తిగా స్వస్తి చెప్పి మంచి పుస్తకాలు చదవటం లోనూ, నిరంతర మథనంలో ఉదయించే భావాలకు సమకాలీన జీవన రీతులు జోడించి కథలరూపాన్ని ఇవ్వటంలోనూ నిమగ్న మైంది. ఫలితం రెండేళ్ళకి నిర్మల ఓ రచయిత్రి కాగలిగింది. మనోబలంతోను, కలం బలంతోనూ ఆమె సృష్టిచేసే కథలు ఎన్నో పత్రికల ద్వారా పాఠక లోకాన్ని అలరిస్తున్నాయి. పాఠకులు అభిమానంతో ఆదరంతో రాసే ఉత్తరాలు తను ఆప్యాయంగా అందుకోగలుగుతుంది. స్నేహితురాళ్ల మెచ్చుకోలు, పెద్దల

అభినందనలు అన్నీ చిరునవ్వుతో స్వీకరిస్తోంది. తను రాసిన కథలు ఎన్ని అచ్చువుతున్నా ప్రతి కథకి వదిన మురిపెంగా స్వీట్ చేసి తినిపిస్తూంటే నిర్మలకి ముచ్చటగానే ఉంది. తన కథలు చదివి అన్నయ్య ఆనందించినపుడు సంతోషంగా పాలు పంచుకోగలుగు తోంది. అయినా అంతరంగంలో ఓ మూల తొలికథా సంఘటన కలవర పెడుతూనే ఉంది. నిర్మల బి. ఎ. పూర్తి చేయటంతో ఆమె కోసం వరాన్వేషణ ప్రారంభం అయింది. తొలిసారిగా పెళ్ళి చూపులనే సరికి ఆ రోజు సిగ్గు తెరలు కమ్ముకొచ్చాయి.

"ఇంతా ఏమిటి వదినా ఈ తతంగాలు? నాకేదోలా ఉంది బాబూ?" వదిన ప్రక్కనే కూర్చుని కూరలు తరిగి పెడుతూ గోముగా అంది.

"అందరికీ ఏదోలానే ఉంటుందిలే? మీ అన్నయ్య అయితే నన్ను తెగ పరీక్షించారమ్మాయి? ఛలోక్తిగా అంది సుశీల.

"ఏం పరీక్ష!"

"ఈ సిగ్గు బిడియం ఆడపిల్లలకు సహజమే కానీ అమ్మాయి గారు తొలికథ అచ్చయినరోజే ఇవన్నీ ఒలకపోశారు".

ఆమాట సుశీల ఛలోక్తిగానే అన్నా ములుకులా తగిలింది నిర్మలకి. చివాల్న లేచింది. అయినా సుశీల ఆ రోజంతా నిర్మలని ఆటపట్టిస్తూనే ఉంది. ఐదు, ఆరుగంటల మధ్య ఇంటిముందు టాక్సీ ఆగింది. అన్నయ్య నాన్నగారు ఎదురెళ్ళి వచ్చిన వాళ్ళని లోపలికి తీసుకుని వస్తున్నారు. నిర్మల గుండె వేగంగా కొట్టుకుంది.

"ఏమిటమ్మా నిమ్మీ! పువ్వులు పెట్టనిచ్చావేకాదు. జడలో జాజులు పరిమళిస్తే కళ్ళల్లో వలపులు తళుకు లీనితే ఈ అమ్మాయి

ఆ వచ్చిన అబ్బాయికి ఇల్లాలై పోతుంది." ఆదపడచు జడలో జాజిమాల తురిమింది సుశీల.

"సుశీ ఇంకా మీరు తయారు కాలేదా? చూడు కాఫీ టిఫిన్లు".

"ఎంతమంది వచ్చారేమిటి" హడావిడిగా వంటిట్లోకి వచ్చిన భర్తను ప్రశ్నించింది.

"పెళ్ళికొడుకు కాక అతని తండ్రి, అక్కగారు, మరో ఇద్దరు స్నేహితులు."

"రెండు నిమిషాల్లో వచ్చేస్తున్నా" ట్రేలో ఫలహారపు ప్లేట్లు అమర్చి నిర్మల చేతికిచ్చింది. "నేను మంచి నీళ్లు కాఫీ తీసుకొస్తాను నువ్వు పదమ్మా"

ట్రే టేబిల్‌పై పెట్టి వచ్చిన వాళ్ళకి ఎదురుగా పరచిఉన్న చాపపై తల్లి ప్రక్కన కూచుంది నిర్మల.

"నీ పేరేమిటమ్మా" ఎంతో సున్నితంగా తీయని పలకరింపు లానే ప్రశ్నించింది ఆమె.

"నిర్మల" నెమ్మదిగా జవాబిచ్చింది.

"ఏం చదివావమ్మా" పెళ్ళికుమారుని అక్క మళ్ళీ అడిగింది.

"బి.ఎ."

ఆ తరువాత ఏవేవో మాటలు వారందరి మధ్యా కబుర్ల రూపంలో దొర్లిపోతున్నాయి. ఎన్నెన్నో ప్రస్తావనలు ఆ సంభాషణ లలో చోటు చేసుకుంటున్నాయి. "అసలు రెండేళ్ళ క్రితం వరకు మేం ఈ ఊళ్లోనే ఈ ఇంట్లోనే ఉండేవాళ్ళం. నాకు బదిలీకావడంతో గుంటూరు వెళ్ళిపోయాం. ఏవిటో ఈ ఇల్లు మాకు ఎంతో అచ్చి వచ్చింది. అదోరకమైన నమ్మకం మా అందరికీ. "మా అమ్మాయి

ఈ ఇంటికి వచ్చిన రోజునే మొదలుపెట్టి రాసిన నవలకి బహుమతి కూడా వచ్చింది" అని తండ్రి అనబోతూంటే.

"ఊరుకోండి నాన్నా! చాదస్తం అనుకుంటారు. నేను అప్పటికి ఎన్నో కథలు రాసానుగా" మాలతి నవ్వుతూ అనేసింది.

నిర్మల ఉలిక్కిపడింది. "ఏవిటీ? అయితే తను, ఈమె" ఆపై ఆలోచించ లేకపోయింది.

"ఓహో! శ్రీమతి మాలతీ మధుకర్ అనే పేరు ఈమెదా? అయితే కథలు, నవలలు ఈమెవి చాలా చదివాం" సుశీల, మూర్తి ఒకేసారి అన్నారు

"చూడమ్మా మాలతీ, మా అమ్మాయీ కథలు రాస్తుంది. దానికి కూడా ఈ మధ్య ఏదో కథల పోటీలో బహుమతి కూడా వచ్చింది. "మాలతి వైపు సంతోషంగా చూస్తూ తల్లి అంటున్న మాటలు నిర్మల మనసుని పిండేశాయి. ఇక తను ఆ సంతోషాగ్నిని గుండెలో దాచుకోలేదు. అవకాశం వచ్చినపుడు వదులుకుంటే తన ఇన్నాళ్ళ తపన వృధా అయిపోతుంది. అన్నయ్యకి ట్రాన్స్‌ఫర్ అయి ఈ ఊరు వచ్చినరోజు తను అమ్మ వదినలతో కలిసి హడావిడిగా ఇల్లు సర్దుతుంటే దొరికిన ప్రతి రఫ్ పేపరుమీదా ఏవో చక్కని మాటలు కథల మధ్యలో సంఘటనలు రాసి ఉన్నాయి. అవి తనను ఎంతో ఆలోచింప చేసాయని? అయితే ఈ యింట్లో ఓ రచయితో రచయిత్రో ఉండే వారన్నమాట. ఇంట అడుగు పెట్టిన ముహూర్తాన్నయినా తనూ ఓ రచయిత్రి అయితే బాగుండును అనుకుంది. అలా తన కళ్ళపడ్డ కాగితాలు శ్రద్ధగా చదువుతుంటే అన్నయ్య ఎంత ఎగతాళి చేసాడని? "కాగితం పుస్తకం కళ్ళ పడ్డమే ప్రమాదము ఒళ్లు మర్చిపోతావు అంటూ! "ఇలానే అంటూండు

ఏదో ఒక రోజున నిజంగా నేను ఓ రచయిత్రిని అయిపోతాను" అని తను ఎదురు జవాబిచ్చింది.

కానీ కథలు రాయటం అంటే మాటలా?

తనకి ఏవేవో ఊహలు వచ్చేవి. అక్షర రూపం ఇచ్చేలోగానే చెల్లాచెదరై పోయేవి. కథ రాద్దాం అని కలం పట్టుకుంటే చేయి ఒణికేది. అన్నయ్యతో తనమాట నిజం కావటం ఎలా అని ఆలో చిస్తున్న తనలో పోస్ట్‌మాన్ ఇచ్చిన ఓ కవరు ఆశలు రేపింది. మాలతి పేరుమీద ఓ మాగజైన్ నుంచి రిటర్న్ అయిన కథ తన కందించి వెళ్లాడు. ఎవ్వరూ ఇంట్లోలేని సమయంచూసుకుని ఆ కథను చదివింది. ఎంత బావుందని! దాన్ని తన పేరుమీద తిరిగి రాసి మరో పత్రికకు పోస్టు చేసివచ్చినా తను అన్నయ్యముందు ఎంతో గర్వంగా నిలబడగలననుకుంది. కాని అది అచ్చయినది మొదలు తనలో ఎంత పశ్చాత్తాపం రగులుకుంది. ఇక ఆలస్యం చేస్తే లాభంలేదు. సమయం మించిపోతోంది.

"వదినా" నెమ్మదిగా పిలిచింది.

"చెప్పు" అన్నట్లు సుశీల నిర్మలకి మరింత దగ్గిరగా జరిగింది. తన గదివైపు చూపిన ఆడపడచుని చేయిపట్టి లేపింది.

"నువ్వు అదృష్టవంతురాలి వమ్మాయి. వేరే నేను చెప్పటం ఎందుకులే! వాళ్ళమాటలు నువ్వు వింటున్నావుగా, కట్నకానుకల మీద అసలు మోజు లేదు. మంచి కుటుంబం అమ్మా! అతగాడు నిన్ను ఎంతో అపురూపంగా చూసుకుంటాడు". వదినమాటలేవీ నిర్మలచెవికి సోకడం లేదు.

"ఏం నిమ్మీ! నాతో ఏదయినా చెప్పాలనుకుంటున్నావా? అలా

అయితే దాచకు. నాదగ్గర నీకు సంకోచం ఎందుకు?" లాలనగా నిర్మలని దగ్గరకు తీసుకుంటూ అంది సుశీల.

"అదికాదు వదినా! నేను ఆవిడతో మాట్లాడాలి!"

సుశీల విస్తుపోయింది "ఇప్పుడెందుకమ్మా ఆవిడ సలహాలు సాహిత్య పరంగా నీకేమైనా కావలసి వస్తే మీ పెళ్ళైన తరువాత మాట్లాడుకోవచ్చుగా?"

"అబ్బ అదేంకాదు నేను ఆవిడతో ఒక్కసారి మాట్లాడి తీరాలంతే?"

సుశీల ఆశ్చర్యం నుంచి తేరుకోలేకపోతోంది.

"ఏమిటీ పిల్ల పట్టుదల?" అనుకుంటూ వాళ్ల మధ్యకు వెళ్ళింది.

"నిమ్మీ ఒక్కసారి మాట్లాడాలంటోందండీ."

మాలతి ముఖంలో చిరునవ్వు విరిసింది. ఈ రోజుల్లో ఇదో రివాజై పోయింది లెండి. ఇందులో పట్టించుకోవలసింది లేదు. అలాగే కానిద్దాం. లేరా తమ్ముడు."

"అహ! మీరు మన్నించాలి. తను మాట్లాడతానంటోంది మీతోనే. మాలతి వంతు కూడా ఆశ్చర్యపోడమే అయింది.

సుశీల చూపిన గదిలోకి వెళ్ళింది. మాలతి అడుగుపెట్టగానే నెమ్మదిగా తలపు మూసింది నిర్మల.

"నన్ను క్షమించగలరా" అంటూ మాలతి పాదాలపై వాలి పోయింది.

ఏమిటీ పిల్ల! తనతో మాట్లాడాలనటం ఏమిటి? పాదాలపై

వాలిపోవటం ఏమిటి? ఇంతకీ తనెందుకు క్షమించటం? ఈ క్షణం వరకూ తనెవరో ఆమె ఎవరో?

మృదువుగా నిర్మలను చేతులు పట్టిలేపి

"ఏమిటమ్మా ఈ బేలతనం నాకేం అర్థంకావటం లేదు. నీ మనస్సులో ఏం ఉందో సూటిగా చెప్పు" ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసింది. ఆ కళ్లు నీళ్లతో నిండిపోయాయి. మాలతిలో మరో అనుమానం అంకురించింది.

ఈ అమ్మాయికి ఏదైనా ప్రేమకథ ఉందా? లేక మోసపోయి ఏమయినా, అసలెందుకు ఇన్ని రకాలుగా ఊహించుకోవటం." అనుకుని మళ్ళీ "చెప్పమ్మా నాతో ఏం మాట్లాడలనుకుంటున్నావు" రెట్టించింది. ఈసారి మాలతి స్వరంలో కాస్త కాఠిన్యం ఉంది. వెంటనే నిర్మల ధైర్యాన్ని కూడదీసుకుంది. విషయాన్ని ఆమె ముందుంచింది.

"మీరు మన్నిస్తేనే నా మనసుకి శాంతి మాలతిగారు, నేను చేసిన పొరపాటు నాలో భరించలేని పశ్చాత్తాపాన్ని కలిగించింది. నా తప్పు ఒప్పుగా చెలామణి చేసుకోవాలని నేనెప్పుడూ అనుకోలేదు. ఈ రెండేళ్ళుగా నేను ఎంత వ్యధ భరించానో మాటల్లో చెప్పలేను. నా పాపాన్ని ప్రక్షాళన చేసుకునే అదృష్టం మీ దయవల్ల ఇలా కలిగింది

మాలతి నిశ్చేష్టురాలై ఉండిపోయింది. తను ఆ కథను గురించే మర్చిపోయింది తనకి తానుగా నిర్మల చెప్పేవరకు గుర్తేలేదు. నాన్నగారికి ఇక్కడి నుంచి బదిలీకాగానే తనకి పెళ్ళికుదిరి పోవటం. మధుకర్ తనని తీసుకువెళ్ళిపోవడం, తను పుట్టకపోతే ఏదో ప్రపంచం మునిగిపోతుందన్నట్లు వెంటనే బాబిగాడు పుట్టుకు

రావడం ఈ కథని తన మనస్సులో మరుగున పడేశాయి. కొత్త వేవో రాస్తున్నా పాతవాటిని గురించి పట్టించుకోనే లేదు. నిజానికి ఆ కథ అచ్చయినట్లు కూడా తెలియలేదు.

"చెప్పండి మాలతిగారూ! నన్ను క్షమించలేరా. మీరే శిక్ష విధించినా నేను సిద్ధమే!"

"సరే నమ్మా! నేను నీకు శిక్ష విధించదలచుకున్నాను. అదే మిటో నువ్వు చెప్పుకో. ఇప్పుడు నువ్వుకూడా రచయిత్రివేగా!

"నేను చేసిన తప్పిదానికి మీరు విధించే శిక్ష ఇది అని చెప్ప లేను! అది మీనోటే వింటాను."

"సరే చెబుతున్నా! అరుదైన నిజాయితీ నీలో చూసానమ్మా. తప్పు చెయ్యని వారెవ్వరూ ఉండరు. తన తప్పుని తెలుసుకొని పశ్చాత్తాపంతో అవకాశం వచ్చినప్పుడు మనసులను పాపపంకిలం నించి ప్రక్షాళనచేసి కోవటమే గొప్ప విషయం. నైతిక విలువలు కరువై పోతున్న ఈ రోజుల్లో ఆత్మవంచనే బ్రతుకుతెరువుకు ప్రధాన సూత్రంగా మనుగడ సాగిస్తున్న ఈనాటి సమాజంలో నువ్వు ఇలా చేయటమే నాకు ఎంతో సంతోషంగా ఉంది.. అద్దానికి కూడా శుభ్రత అవసరమే కదా. అప్పుడే మనం మన ప్రతిబింబాన్ని స్పష్టంగా చూసుకోగలుగుతాం. అద్దంలాంటి నీ హృదయం నా తమ్ముడిదైతే వాడి బ్రతుకులో సుఖశాంతులు వెల్లి విరుస్తాయి. నిన్ను నా ముద్దుల మరదలుని చేసికోవడమే నేను నీకు విధించ దలచుకున్న శిక్ష" అప్యాయంగా నిర్మలని ఆలింగనం చేసుకుంది మాలతి. మనసు భారం, తీరిపోయిన నిర్మల ఆమె హృదయంలో గువ్వపిట్టలా సంతృప్తితో సంతోషంతో ఒదిగిపోయింది. ●